20, 21 తేదీల్లో పల్స్ పోలియో

ప్రజాశక్తి -పాడేరు: జీరో టు ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఈనెల 20, 21 వ తేదీలలో పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ,స్త్రీ శిశు సంక్షేమ శాఖ, సంబంధిత శాఖలతో పల్స్ పోలియో కార్యక్రమం ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మైక్రో యాక్షన్ ప్లాన్ తయారుచేసి రూట్ మ్యాప్ ఏర్పాటు చేసుకొని పల్స్ పోలియో వ్యాక్సినేషన్ పంపిణీ జరగాలన్నారు. గ్రామస్థాయిలో ముందుగానే జీరో టూ ఐదు సంవత్సరాల పిల్లల వివరాలను డోర్ టు డోర్ సర్వే చేసి ఆశ వర్కర్స్, అంగన్వాడీ టీచర్స్, ఏఎన్ఎమ్స్ ద్వారా పల్స్ పోలియో వ్యాక్సినేషన్ జరిగే విధంగా చూడాలన్నారు. గ్రామస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, పంచాయతీ కార్యాలయాల వద్ద, గ్రామ సచివాలయం వద్ద పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం ఏర్పాటు చేసి పిల్లలందరకు అందే విధంగా చూడాలన్నారు.బస్సు స్టాపులలో ప్రత్యేక కౌంటర్స్ ఏర్పాటు చేసి పోలియో చుక్కలు వేసే విదంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ, విద్యుత్ శాఖ, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

కెకె లైన్ రెండో దశ రోడ్డు విస్తరణ పనులతో...

జిరాయితీ భూములకు నష్టం

- జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి -అనంతగిరి :కొత్తవలస- కిండల్ కేకే లైన్ రెండోవ రోడ్డు విస్తరణ పనులలో భాగంగా జిరాయితి భూముల నష్టంపై జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ కు ఫోనులో ఫిర్యాదు చేయడం జరిగిందని స్థానిక సీపిఎం జెడ్పిటిసి దీసది.గంగరాజు అన్నారు. ఎగువసోభ పంచాయితీ పొర్నాపొదర్ గ్రామానికి చెందిన సాగర. సన్యాసి తోపాటు మరికొంతమంది రైతులకు చెందిన జిరాయితి భూములు రోడ్డు విస్తరణ పనుల్లో పూర్తిగా నష్టానికి గురవుతున్నాయన్నారు. దీనిపై బుధవారం ఆ ప్రాంతంలో సందర్శించి జరుగుతున్న పనులు, భూముల నష్టాన్ని పరిశీలించడం జరిగిందని తెలపారు. రైతులకు చెందిన భూముల వెంబడి మీదుగా రైల్వే రెండవ రోడ్డు సొరంగుల పనులు చేస్తున్నారన్నారు. దీంతో ఈ భూములే కాకుండా సంవత్సరానికి ఆదాయం నిచ్చే కాఫీ, మిరియాల వంటి తోటలు కూడా పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉందన్నారు. దీనిపై సంబంధిత సిబ్బందిని ప్రశ్నిస్తే తమకు తెలియదని తప్పించుకుంటున్నారని అన్నారు. తక్షణమే పనులు నిలిపివేసి భూములు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించిన అనంతరమే పనులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే సంబంధిత రైతులతో కలిసి పనులు అడ్డుకుని తీరుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి టోకూరు సర్పంచ్ కిల్లో. మోసియా, ఎగువ శోభ సర్పంచ్ కొర్రా. సింహాద్రి, వార్డు మెంబర్ సాగర ప్రసాద్, పేసా కమిటీ సభ్యులు సాగర. అనిల్, సొంటరి. కుమార్, పాంగి .దాసు గ్రామస్తులు రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

మాట్లాడుతున్న కలెక్టర్

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

- కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి - పాడేరు : జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ హెచ్చరించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో లింగ నిర్ధారణ జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ,ఆడ, మగ, సమతుల్యాన్ని సాధిద్దాం అని తెలియజేసారు. ఈ చట్టం ప్రకారం గర్భం ధరించడానికి ముందుగాని, గర్భం ధరించిన తర్వాత గాని పుట్టబోయే బిడ్డ లింగ ఎంపిక/నిర్ధారణను నిరోధిస్తుందన్నారు. ఈ చట్టంలోని నిబంధనలు మొదటి సారి ఉల్లంఘించిన వైద్యులు/ నిపుణులు / ఇతరులకు మూడు సంవత్సరాల జైలు శిక్ష మరియు పదివేల రూపాయల జరిమానా విధించబడుతుంని తెలిపారు. తదువరి ఉల్లంఘనకు యాభై వేల రూపాయల జరిమానాతో పాటు ఐదేళ్ల జైలు శిక్ష కూడా విధించడం జరుగుతుందన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు చేసి వివరాలు చెప్పమని అడిగిన, అడగమని ప్రోత్సహించిన మరియు చెప్పిన వారికి మొదటి తప్పుకు చట్టప్రకారం 3 ఏళ్ల జైలు శిక్ష, 50 వేలు జరిమానా విధించబడుతుందన్నారు. జిల్లాలో రిజిస్టర్ కాని 15 అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లను తక్షణమే రిజిస్టర్ చేసి వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. అత్యవసర స్కానింగ్ శిక్షణ నిమిత్తం కే.జి.హెచ్ గైనిక్ విభాగంలో ఆరు నెలల పాటు శిక్షణ ఇప్పించి వారి సేవలను తిరిగి జిల్లా పరిధిలో వినియోగించుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఎంఅండ్ హెచ్ఓ కృష్ణమూర్తి నాయక్, మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డి. హేమలత, డాక్టర్లు టి.నరసింహరావు, శ్రీలత, సృజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారి సిహెచ్ ఝాన్సీ భాయ్ పాల్గొన్నారు.

జల్ జీవన్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని జీ. తాడేపుట్టు పంచాయతీ పరిధిలోని యు.బొడ్డపుట్టు గ్రామంలో జల్ జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికి మంచినీటి సరఫరా పథకాన్ని బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. బోరు పనులను స్థానిక సర్పంచ్ సోమేలి సత్యవతి, ఎంపీటీసీ కిలగడ సింహాచలం చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, జల్ జీవన్ మిషన్ ద్వారా రూ. 5.50 లక్షల వ్యయంతో గ్రామానికి శాశ్వత తాగునీటి సౌకర్యం కల్పించేందుకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. గతంలో తాగునీటి సౌకర్యం లేక గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రజల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ప్రస్తుతం బోరు పనులు ప్రారంభించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బద్నాయిని బొంజు బాబు, వార్డు సభ్యులు కితలంగి కేశమ్మ, టీడీపీ నాయకులు సోమేలి లక్ష్మయ్య, పీసా సెక్రెటరీ సోమేలి వెంకన్న, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

గుడిసె గ్రామాభివృద్ధిపై నిర్లక్ష్యం

టూరిజాన్ని వ్యతిరేకిస్తూ పీసా గ్రామసభలో ఏకగ్రీవ తీర్మానం

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి మండలం పుల్లంగి పంచాయితీ పరిధి గుడిసె గ్రామాభివృద్ధిపై ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ గుడిసె టూరిజాన్ని వ్యతిరేకంగా పీసా గ్రామసభలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. పుల్లంగి పంచాయతీలో బుధవారం జరిగిన పీసా గ్రామసభలో పాముల మామిడి, గుడిసె, చెలక వీధి పీసా గ్రామసభ ఉపాధ్యక్ష కార్యదర్శులు ప్రజా ప్రతినిదులు వందలమంది ప్రజలు గ్రామ సభను ఏర్పాటు చేయటం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గుడిసె పర్యాటక ప్రాంతం పేరుచెప్పి లక్షాలాది రూపాయులు అటవీ శాఖ వారు దండుకుంటున్నారే తప్పా తమ గ్రామానికి ఎటువంటి ఉపయోగం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ శాఖ అధికారులు ఒప్పందం చేసిన వాటర్ ట్యాంక్, రోడ్డులను గుడిసె గ్రామభీవృద్ధిని మరిచి పోయి చెక్ పోస్టులు పెట్టి లక్షాలాది రూపాయలతో దండుకుంటున్నారని ఆరోపించారు. ఆదివాసీల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఐటిడిఎ కూడా ఇప్పటికి బడి ఈడు పిల్లలకు పక్కా భవనం ఏర్పాటు చేయలేక పోయిందని తెలిపారు. ఆదివాసీల అమాయకత్వాన్ని అలుసుగా తీసుకొని అధికారులు గ్రామాభివృద్ధిని పక్కన పెట్టి పర్యాటక ప్రాంతమైన కొండను అభివృద్ధి చేయాలని చూస్తున్నారని పేర్కొన్నారు. అందుకే గుడిసె టూరిజాన్ని వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఈ గ్రామసభలో ఎంపిటిసి సభ్యురాలు బున్నమ్మ, అందాల మంగిరెడ్డి, సాదల సోమిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు పీసా కమిటీ ఉపాధ్యక్ష, కార్యదర్శులు పాముల మామిడి రవీంద్రరెడ్డి, లింగారెడ్డి, ఎగవలస రత్నారెడ్డి, లింగారెడ్డి, గుడిసె సాదల కొమ్మిరెడ్డి, కోండ్ల పెద్ద కొమ్మిరెడ్డి, సిబిఈటి సభ్యుడు కోండ్ల చిన్నారెడ్డి, పంచాయితీ ప్రజలు పాల్గొన్నారు.

గ్రామసభలో పాల్గొన్న గిరిజనులు

గ్రామాల్లో 'రైతన్నా మీకోసం'

కూనవరం మండలం కాటూరులో రైతులతో సమావేశమైన అధికారులు

ప్రజాశక్తి-కూనవరం : మండలంలోని కూటూరు గ్రామ సచివాలయం పరిధి రైతులతో మండల వ్యవసాయాధికారి దేవి రైతన్న మీకోసం యాక్షన్ ప్లాన్ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్, రైతు పాయం సీతారామయ్య మాట్లాడుతూ గ్రామంలో వరద ముంపు లేని గిరిజన రైతుల భూములకు సాగునీటి వసతి కల్పన కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. సబ్సిడీ ద్వారా ప్రభుత్వం సోలార్ పంపులు, సోలార్ కంచెలు మంజూరు చేయాలన్నారు. పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వల్ల కొన్ని భూములు పంటలు వేసే పరిస్థితి లేదని, ఈ యాక్షన్ ప్లాన్‌లో

చింతూరు : మండలంలోని తుమ్మల సచివాలయం వద్ద సర్పంచ్ కొవ్వాసి రామారావు, ఎంపీటీసీ వేక రాజ్‌కుమార్ ఆధ్వర్యాన రైతన్నా మీ కోసం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి రత్నప్రభ తుమ్మల సచివాలయం

అయినా పంటలు పండించే దానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అభిచర్ల సర్పంచ్ కారం రాణి, నూపరాజు, చిచ్చడి రాజయ్య, రైతులు పాల్గొన్నారు.

పరిధిలో రబీ 2025- 26, ఖరీఫ్ 2026, రబీ 2026- 27 రాబోయే 3 పంట కాలానికి పంటల సరళిలో చేయాల్సిన మార్పులు, విత్తనాల ఎంపిక, ఎరువుల లభ్యత, ప్రకృతి వ్యవసాయం మొదలగు అంశాలపై రైతులతో చర్చించారు. వరి, అపరాల విత్తనాలు సీజన్‌కు ముందుగా సకాలంలో సరఫరా చేయాలని, తక్కువ పంట కాలం విత్తనాలు ఇవ్వాలని సర్పంచ్, ఎంపిటిసి, రైతులు కోరారు. వ్యవసాయ పనిముట్లు, ఆయిల్ ఇంజిన్లు, స్ప్రేయర్లు, పవర్ టిల్లర్లు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో తుమ్మల కార్యదర్శి దేవిప్రియ, సహాయకులు లక్ష్మి పాల్గొన్నారు.

చింతూరు మండలం తుమ్మలలో..

'యూనిటీ ట్రస్ట్' సేవలు అభినందనీయం

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

పాల డబ్బాలు ఇస్తున్న సురేంద్ర, ట్రస్టు ప్రతినిధులు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: చిన్నారులకు యూనిట్ ఫర్ చారిటబుల్ ట్రస్ట్ ఉచితంగా పాల డబ్బాలు పంపిణీ చేస్తున్న సేవలు అమోఘమని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే,సురేంద్ర కొనియాడారు. అరకులోయ మండలం చంపి పంచాయితీ గమ్మినవలస గ్రామానికి చెందిన కె డలిమ అనే గర్భిణి గత నాలుగు నెలల క్రితం కవల పిల్లలకు జన్మించింది. కవల పిల్లలకు పాల డబ్బులు పెట్టడానికి ఆర్థిక స్తోమత లేక పోవడంతో యూనిటీ ఫర్ టబుల్ ట్రస్టును ఆశ్రయించడంతో వారు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. బుధవారం అరకు సంతబయలులోని ఆ ట్రస్ట్ కార్యాలయంలో పలు డబ్బలను సురేంద్ర చేతుల మీదుగా పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనేకమంది తల్లికి దూరమైన చిన్నారులు తల్లి పాలు సరిపోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు అటువంటి వారికి ఈ యూనిట్ పరచాలిటీ ట్రస్ట్ ఉచితంగా పాలు డబ్బాలను పంపిణీ చేస్తూ ఆదుకుంటుందని చెప్పారు. డుంబ్రిగుడ మండలంతో పాటు అనంతగిరి ,అరకులోయ, హుకుంపేట, పెదబయలు ముంచంగిపుట్టుతో పాటు పాడేరు, జి.మాడుగుల మండలాల్లో కూడా సేవలు అందిస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఫర్ చారిటీ ట్రస్ట్ ఫౌండర్ ఎన్.నారాయణ, సభ్యులు ఎన్ జోస్పిన్, ఆ సంఘం మండల కార్యదర్శి సూర్యానారాయణ, జి.జగన్నాథం పాల్గొన్నారు.

సీలేరులో వాహన తనిఖీలు చేస్తున్న ఎస్సై యాసిన్

పోలీసుల ముమ్మర తనిఖీలు

ప్రజాశక్తి-సీలేరు : మావోయిస్టు వారోత్సవాలు ఈనెల 2 నుంచి 8వ తేదీ వరకు జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. స్థానిక ఎస్సై యాసీన్ ఆధ్వర్యంలో బుధవారం సీలేరు పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఏపీ జెన్కో చెక్ గేట్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించి విడిచిపెట్టారు. ఎఒబి సరిహద్దులో పోలీసు బలగాలు మోహరించి పటిష్టమైన భద్రత చర్యలు చేపడుతున్నారు. పోలీసులు అలజడితో సరిహద్దు గిరిజనులలో తీవ్ర భయనిక వాతావరణం నెలకొంది. వారోత్సవాలు నేపథ్యంలో మన్యంలో తిరిగే ఆర్టీసీ నైట్ సర్వీస్ బస్సులను అధికారులు ఇప్పటికే రద్దు చేశారు. నర్సీపట్నం డిపోకు చెందిన పగటిపూట బస్సు సర్వీసులు మాత్రమే తిరుగుతున్నాయి. పూర్తిస్థాయి బస్సులు తిరగకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు గురవుతున్నారు.

ఐటిడిఎ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వాగుఒడ్డుగుంపు గ్రామస్తులు

రోడ్డు నిర్మాణం చేయాలని ధర్నా

ప్రజాశక్తి-చింతూరు : మండలంలోని లక్ష్మీపురం పరిధి వాగు ఒడ్డు గుంపు గ్రామానికి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతూ గ్రామస్తులు గిరిజన సంఘం ఆధ్వర్యంలో చింతూరు ఐటీడీఏ వద్ద బుధవారం ధర్నా నిర్వహించి, ప్రాజెక్ట్ అధికారికి వినతి పత్రం అందించారు. గ్రామ ఏర్పడి 40 ఏళ్ళు కావస్తున్నా నేటికీ రోడ్డు లేకుండా 25 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనికి స్పందించిన పిఓ స్థానికరోడ్డును తక్షణమే ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకోవాలని తహశీల్దారును ఆదేశించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్ మాట్లాడుతూ ఆదివాసి గ్రామాల ప్రధాన సమస్యలైన రోడ్లు, మంచినీళ్లు, విద్యుత్తు సౌకర్యాలను తక్షణమే మెరుగుపర్చాలని కోరారు. ప్రతి గుడెంకు పాఠశాల ఏర్పాటు చేసి విద్య అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కారం సుబ్బారావు, సవలం రాము, మడక ముత్తయ్య, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ తనూజరాణి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:అరుకు పార్లమెంట్ సభ్యురాలు గుమ్మ తనూజరాణి జన్మదిన వేడుకలు అరకులోయలోని మాజీ ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యకర్తలు, నాయకులు, అభిమానులు కేక్ కట్ చేశారు. హస్తినాలో ఉన్న అరుకు ఎంపీకి వాట్సాప్, వీడియో కాల్, ఫోన్ల ద్వారా జన్మదిన శుభాకాంక్షల సందేశాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పార్టీ జిల్లా ఎస్టి సెల్ ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ జిల్లా అధికార ప్రతినిధి శెట్టి అప్పాలు, బస్కి సర్పంచ్ సర్పంచ్ పోరం అధ్యక్షులు పాడి రమేష్, జడ్పిటిసి బాక సింహాచలం, చటారి కృష్ణారావు, వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జన్నీ నరసింహా మూర్తి, వైసీపీ సీనియర్ నాయకులు బూర్జ సుందర రావు, శ్రీరాములు, వైస్ ఎంపీపీ కిల్లో రామన్న పాల్గొన్నారు.

కేక్‌ను కట్ చేస్తున్న నాయకులు

అవగాహన కల్పిస్తున్న సిఐ

గంజాయి రవాణా మార్గాలు మూసేయాలి

ప్రజాశక్తి-చింతపల్లి: ఆంధ్ర- ఒరిస్సా సరిహద్దు ప్రాంతాల నుంచి అల్లూరి ఏజెన్సీ మార్గంగా మైదాన ప్రాంతాలకు తరలిపోతున్న గంజాయి రవాణా మార్గాలు మూసేయాలని సీఐ ఎం.వినోద్ బాబు తెలిపారు. బుధవారం జరగిన చింతపల్లి వారపు సంతలో ఎస్సై2 ఎం వెంకటరమణతో కలిసి పోలీసులు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ, డబ్బుల ఆశకు కొందరు యువకులు మత్తు పదారాలు రవాణా చేస్తూ దొరికి పోతున్నారన్నారు. ఒకసారి కేసులు నమోదైతే భవిష్యత్తులో ఉద్యోగాలు, విద్యావకాశాలు పూర్తిగా కోల్పోతారని సీఐ తెలిపారు. గంజాయి రవాణాలో ఒక్క అడుగు తప్పుగా పడితే జీవితాన్ని చీకటిలోకి నెడుతుందని ఆయన హెచ్చరించారు. ఏజెన్సీ మార్గాల్లో ప్రత్యేక పహారా పెంచామని, రాత్రి పూట రహదారులపై చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. మత్తును అరికట్టడంలో పోలీసులే కాదు, సమాజం బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో బుధవారం జరిగిన ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) మండల కౌన్సిల్ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గొలగాని శ్రీను అధ్యక్షతన జరిగిన ఈ కౌన్సిల్‌లో ఎన్నికల అధికారిగా జి.తేజోరావు, ఎన్నికల పరిశీలకులుగా మిరియాల రమేష్‌బాబు వ్యవహరించారు. యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా గొలగాని శ్రీను, కానెం శ్రీను, గౌరవ అధ్యక్షులుగా మఠం ఉదయ గంగ మనోహర్ కుమార్ (ఉదయ్), సహాధ్యక్షులుగా జంపా రాంబాబు, సహాధ్యక్షురాలిగా కోడూరి లోవరాజు, కోశాధికారిగా తాడి లక్ష్మినరసింహమూర్తి, మహిళా కార్యదర్శిగా లక్ష్మి ప్రసన్న, ఎఫ్‌డబ్ల్యుఎస్ కార్యదర్శిగా బూడి శ్రీనుబాబు, పత్రిక కార్యదర్శిగా లింగేటి కొండబాబు, కార్యదర్శులుగా చెన్నమశెట్టి చిట్టిబాబు, నీలాద్రి రాజుబాబు, సాధనపల్లి అప్పలనరసయ్య, బొంకు దొరబాబు, కుంజం నాగమణి, కోపూరి రమేష్ బాబు, పులి రామకృష్ణ, అడిట్ కమిటీ కార్యదర్శిగా మఠం చంద్రశేఖర్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సుమారు వందమంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొలగాని శ్రీను, కానెం శ్రీను

ప్రారంభానికి నోచని సచివాలయ భవనం

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం గ్రామంలో నిర్మించిన నూతన సచివాలయం భవనం అధికారికంగా ప్రారంభానికి నోచుకోలేదు. భవనం పూర్తిగా సిద్ధంగా ఉన్నప్పటికీ, ప్రారంభోత్సవ తేదీపై అధికారులు స్పష్టత ఇవ్వలేదు. దీనివల్ల గ్రామ ప్రజలు ప్రభుత్వ సేవలు అందుబాటులోకి రావడానికి ఇంకా ఎదురు చూడాల్సి వస్తోంది. భవనం త్వరగా ప్రారంభిస్తే గ్రామ ప్రజలకు అవసరమైన సేవలు సులభంగా చేరనున్నాయని స్థానికులు చెబుతున్నారు. భవనం నిర్మాణం పూర్తయి సుమారుగా రెండు సంవత్సరాలు కావస్తున్నా ప్రారంభం ఆలస్యం కావడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. సచివాలయం పనిచేయడం ప్రారంభిస్తే ఆధార్ సేవలు, పింఛన్ దరఖాస్తులు, రేషన్ సంబంధిత సేవలు, రైతులకు సంబంధించిన పథకాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలన్నీ సచివాలయంలోనే సులభంగా అందుబాటులోకి రానున్నాయి. అధికారులు మాత్రం దీని ఊసే ఎత్తడం లేదు. ఇప్పటికైనా సచివాలయ భవనాన్ని ప్రారంభించాలని కోరుతున్నారు.

నిర్మాణం పూర్తయిన గ్రామ సచివాలయ భవనం

అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలపై వినతి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోనీ అన్ని అంగన్వాడి కేంద్రాల్లో సకాలంలో సరుకులు అందించాలని సిఐటియు మండల కార్యదర్శి కొర్ర శంకర్‌రావు ఆధ్వర్యాన బుధవారం ఐసిడిఎస్ పిడి ఝాన్సీబాయికి సమస్యలు పరిష్కరించాలని సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శంకర్‌రావు, ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షులు ఎంఎం శ్రీను మాట్లాడుతూ, మండలంలోని మారుమూల అంగన్వాడి కేంద్రాలలో ప్రతినెలా సరుకులు సకాలంలో అందించలేదన్నారు. ఏళ్ల తరబడి అంగన్వాడి కేంద్రాలలో వంట పాత్రలు, కుక్కర్లు లేక అంగన్వాడిలు, హెల్పర్లు సొంత సామగ్రితోనే వంట చేస్తున్నారన్నారు. పెరిగిన ధరలకనుగుణంగా అంగన్వాడి కేంద్రాలలో మెనూ చార్జీలు పెంచాలని, పెండింగ్లో ఉన్న డైట్ చార్జీలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరమ్మ, పార్వతమ్మ, మౌలమ్మ, చిలకమ్మ, సూరమ్మ, కళావతి అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

కేక్‌ను కట్ చేస్తున్న నాయకులు

7న నవోదయ మోడల్ పరీక్ష

ప్రజాశక్తి-చింతపల్లి:స్థానిక ఎస్ఆర్ టెక్ హబ్ కంప్యూటర్ ఇన్స్టిట్యూట్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత నవోదయ మోడల్ పరీక్షను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, మన్యం కవి నూనె రమేష్ తెలిపారు. ఈ మోడల్ పరీక్షను ఈనెల 7న ఆదివారం ఉదయం 10 గంటలకు చింతపల్లి కేంద్రంలో నిర్వహించనున్నామన్నారు.ఈ పరీక్షలో పాల్గొనదలచిన విద్యార్థులు ఈనెల 5 లోపు తప్పనిసరిగా ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తిచేసుకున్న వారికి మాత్రమే హాల్టికెట్లు జారీ చేయబడతాయని ఆయన స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్కు సంబంధించిన వివరాల కోసం ఫోన్:9951237879 నంబరుకు సంప్రదించాలన్నారు.

అన్నదాతలకు అవగాహన

మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు

ప్రజాశక్తి-హుకుంపేట: మండల కేంద్రంలోని రైతున్న మీకోసం కార్యక్రమాన్ని బుధవారం వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, సమాజంలో నేడు మారుతున్న ఆహారపు అలవాట్లకు అనుకూలంగా అన్నదాతలు సాగు పద్ధతులు మార్చుకోవాలన్నారు. చిరుధాన్యాల సాగును మరింత పెంచాలన్నారు. ప్రకృతి వ్యవసాయం అవలంబించాలని ఆయన సూచించారు. టీడీపీ మండల అధ్యక్షులు శతక బొంజుబాబు మాట్లాడుతూ, రైతుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. రైతులకు యంత్రాలు సరఫరా చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కొమ్మరమ్మ, మండల ఉపాధ్యక్షులు ఎల్ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బి శ్యామ్, సర్పంచులు బాకురు వెంకటరమణ, సత్యనారాయణ, అరకు నియోజవర్గం మహిళ వైస్ ప్రెసిడెంట్ సాగర సత్యవతి, అరకు నియోజవర్గం మహిళ విభాగం ప్రధాన కార్యదర్శి నాయకురాలు సూర్యకాంతం, టిఎన్ఎఫ్ నాయకులు శంకర్ నాయుడు, కార్యదర్శ జె వెంకట్, కోశాధికారి భరత్ పాల్గొన్నారు.

పాఠశాల భవనానికి శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని జాంగుడ బాలికల ఆశ్రమ పాఠశాలలో అదనపు పాఠశాల భవనం నిర్మాణంకు కోర్రాయా పంచాయతీ సర్పంచ్ పి.కోములు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కే లక్ష్మణ్, టిడిపి ఎస్టీ సెల్ అధ్యక్షుడు కే నాగరాజు, పీసా కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయురాలు కళావతి పాల్గొన్నారు

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడి

ప్రజాశక్తి-పాడేరు: ప్రజలు ఆరోగ్యంగా సుఖ సంతోషాలతో జీవించాలంటే రైతులు సేంద్రియ వ్యవసాయం ద్వారా పండించిన పంటలను, మిల్లెట్స్ ఆహార ఉత్పత్తులను వినియోగించాలని, అలాగే రైతులు అధిక లాభాలు ఆర్జించాలంటే ఈ సాగు చేయాలని తప్పనిసరిని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ సూచించారు. బుధవారం ఉదయం గుత్తులపుట్ గ్రామంలో జరిగిన "రైతన్న మీకోసం" ముగింపు సమావేశంలో పాల్గొన్నారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, ఉద్యానవన ఆధారిత పంటలు, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు వంటి ఐదు సూత్రాల కార్యక్రమంపై రైతులకు వివరించమన్నారు. నీటి భద్రత, బిందు సేద్యం, స్ప్రింక్లర్ పద్ధతి ద్వారా వ్యవసాయం సులభతరం చేసుకోవాలన్నారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా పండే పంటలు వాడటంతో ప్రజలు ఆరోగ్యం, జీవన పరిమాణం పెరుగుతుందన్నారు.పండ్ల తోటలలో సేంద్రియ ఎరువులు వినియోగించి, సూక్ష్మ తుంపర సేద్యం, సాంకేతికపరంగా డ్రోన్ లను వినియోగం ద్వారా నీటిని పొదుపు చేసి అధిక దిగుబడులు పొందాలన్నారు. పిఎం కిసాన్ పథకం ద్వారా రైతులను బలోపేతం చేయడానికి సంవత్సరానికి 20 వేల చొప్పున ప్రభుత్వం ఇస్తుందన్నారు. గ్రామసభల ద్వారా రైతులకు కావలసిన తీర్మానాలను చేసి పంట రుణాలు, చెక్ డాములు ఏర్పాటు చేయుటకు సంబంధిత అధికారులకు ప్రతిపాదనలను పంపి, తద్వారా నిర్మాణ

అవగాహన కల్పిస్తున్న కలెక్టర్

పనులు పూర్తి చేయాలన్నారు.నీటి కాలువల పూడికతీత ద్వారా నీటిని వినియోగించుకొని పంటలు పండించుకునేందుకు వీలుగా రూపకల్పన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గబ్బంగి సర్పంచ్, [illegible] సర్పంచ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్బి ఎస్.నందు, డిపిఎం భాస్కరరావు,జిల్లా పట్టు పరిశ్రమ అధికారి అప్పారావు, వి హెచ్ ఓ జానకిరావు, ఏఈఓ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారుల పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-పాడేరు : జిల్లాలో జాతీయ రహదారుల పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ కోరారు. బుధవారం కలెక్టరేట్లో తన చాంబర్ నందు జిల్లా రెవెన్యూ అధికారులు, రోడ్లు భవనాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రోడ్ల నిర్మాణ పనులలో వచ్చే అవాంతరాలను అధిగమించాలన్నారు. అటవీశాఖ నుండి అనుమతులు త్వరగా లభించే విధముగా ఆ శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న వారికి నష్టపరిహారం త్వరగా చెల్లించాలన్నారు. భూమి అవసరం ఉన్నచోట భూసేకరణ త్వరగా చేపట్టాలని మండల రెవెన్యూ అధికారులకు సూచించారు. కోర్టులో పెండింగ్ లో ఉన్నటువంటి భూ సంబంధిత తగాదాల కేసులు త్వరగా పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా చింతపల్లి, జి. మాడుగుల, పాడేరు మండలాల్లో 516 ఈ జాతీయ రహదారి నిర్మాణానికి ఎటువంటి అడ్డంకులు లేకుండా ఆ మండలాల రెవెన్యూ అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఇంచార్జ్ ఆర్డీవో ఎస్వీఎస్ లోకేశ్వరరావు, రోడ్లు భవనాల శాఖ అధికారులు, వివిధ మండలాల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ పనులపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న పీడీ

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండలంలోని 23 పంచాయితీల పరిధిలోగల అంగన్వాడి కార్యకర్తలు, మినీ అంగన్వాడీలతో బుధవారం మండల కేంద్రంలోని ఐకెపి ఏనిమేటర్ సమావేశ మందిరం వద్ద ఐసిడిఎస్ సిడిపిఓ విమల కుమారి ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ సమావేశం నిర్వహించారు .ఈ సమావేశంలో ఐసిడిఎస్ పిడి ఝాన్సీబాయి మాట్లాడుతూ, అంగన్వాడీలు మొబైల్ యాప్‌లో ప్రతిరోజు నిర్వహించే పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఆన్‌లైన్ పనులు విధిగా అంగన్వాడీలు చేయాలని తెలిపారు. మొబైల్ యాప్‌లపై అవగాహన కల్పించారు.గ్రోత్ మానిటరింగ్, గర్భిణీ, బాలింతలు నమోదు, గృహ సందర్శన వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అంగన్వాడి కేంద్రంలో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, ప్రీస్కూల్ నిర్వహణ, లబ్ధిదారులకు టేక్ హోమ్ రేషన్ సరుకులు సకాలంలో అందించాలన్నారు. గర్భిణీ, బాలింతలు తరచూ ఆసుపత్రిలో చికిత్స, తనిఖీలు చేయించుకునే విధంగా బాధ్యత వహించాలన్నారు. బాల్యవివాహాలు, అనాథ పిల్లల దత్తతపై ఉన్నతాధికారులకు తెలిపాలన్నారు. అంగన్వాడి కేంద్ర పరిసరాలు పరిశుభ్రంగా ఉంచి గ్రామస్తులను అవగాహన పరచాలని తెలిపారు. సమావేశంలో ఐసిడిఎస్ మండల సూపర్వైజర్లు వరహాలమ్మ, రాజేశ్వరి, కొండమ్మ, స్వర్ణ పాల్గొన్నారు.

వైద్య శిబిరం

ప్రజాశక్తి-పెదబయలు :సీతగుంట పంచాయతీ రోగుల గ్రామంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు.వ్యాధి గ్ర స్థులకు స్థానిక వైద్యాధికారుల సహకారం తో మందులు పంపిణీ చేశారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మాట్లాడుత,గా గ్రామంలో పరిశుభ్రత పాటించాలని, లేనిచో దోమలతో వ్యాధులు ప్రభలే అవకాశాలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సిబ్బంది మరియు ఎన్ ఎస్ ఎస్ ప్రాజెక్ట్ అధికారి,50 మంది వాలంటీర్లు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభించాలి

ఆదివాసీ గిరిజన సంఘం నాయకుల డిమాండ్

మాట్లాడుతున్న నేతలు

ప్రజాశక్తి-అరకులోయరూరల్: అరకులోయ మండలంలోని మాదల పంచాయతి పరిధిలోని దాబుగుడ గ్రామానికి గతంలో సుమారు 500 మీటర్ల వరకు మంజూరైన సిసి రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని ఆదివాసీ గిరిజన సంఘ నాయకులు కుమిడి రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మంజూరైన సిసి రోడ్డు పరిశీలించి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిసి రోడ్డు టెండర్ తీసుకున్న గుత్తేదారుడు ఇప్పటికీ పనిని ప్రారంభించలేదని, దీంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సిసి రోడ్డు, డ్రైనేజీ లేక పోవడంతో వర్షాకాలంలో వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరుతుందని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఫిబ్రవరి లోపు రోడ్డు పనులు ప్రారంభించకుంటే ఉద్యమం తప్పదు అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ప్రసాద్, పెసా ఉపాధ్యక్షుడు గురుమూర్తి, రాము పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

పార్టీ కండువా వేస్తున్న దొన్నుదొర

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని కొత్తూరు పంచాయతీ కేంద్రంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమం అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయ కార్యకర్త సియారి . దోన్నుదొర నిర్వహించారు. వైయస్సార్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా కన్వీనర్ భీమవరపు. గంగులుతో పాటు పలువురు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గంగులు మాట్లాడుతూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో తెలుగుదేశం విజయానికి కృషి చేస్తామని తెలిపారు. నియోజకవర్గ ఇన్చార్జ్ దొన్ను దొర మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికలలో మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎస్.సుబ్బారావు, ఉపాధ్యక్షుడు భీమరాజు, మండల యూత్ అధ్యక్షుడు దొంబరి. శ్యామ్, సందీప్, శంకర్రావు, వెంకటేష్ పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను తొలగించాలి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:మండలంలోని అరకు సంత బయలు గ్రామంలో గిరిజనేతరులు నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి సూర్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, అరకు, పాడేరు ప్రధాన రహదారికి ఇరువైపులా గిరిజనేతరులు చట్టాలకు వ్యతిరేకంగా అక్రమంగా కట్టడాలు నిర్మించుకుంటున్నా సంబంధిత రెవెన్యూ శాఖ అధికారులు పట్టించుకోక పోవడం విచారకరమన్నారు. పలుమార్లు స్థానిక గిరిజనులు ఫిర్యాదు చేసినా వాటిని నిలుపుదల చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. తక్షణమే సంబంధిత ఉన్నత స్థాయి అధికారులు స్పందించి అరకు సంత బయలులో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆనంద్

కంప్యూటర్ అక్షరాస్యతపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐక్యూఎసి ఆధ్వర్యంలో విజయవాడ ఏక్సిస్ పాయింట్ సాఫ్ట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్ వారి సహకారంతో ప్రధానమంత్రి ఉచ్చతార్ అభియాన్ స్కీమ్ ఆర్థిక సహకారంతో బుధవారం కంప్యూటర్ అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏక్సిస్ పాయింట్ సాఫ్ట్‌వేర్ నుండి రావూరి వేణు, రిసోర్స్ పర్సన్స్‌గా ఎన్.ఆనంద్, రాపాక కిరణ్మయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్.ఆనంద్ మాట్లాడుతూ కంప్యూటర్ విద్య ప్రాముఖ్యతను అందరికీ చేరవేయడం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రతి రంగంలో కంప్యూటర్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఆర్.కిరణ్మయి మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో పోటీ పరీక్షలు రాయాలన్నా, ఉద్యోగం సాధించాలన్నా కంప్యూటర్ పరిజ్ఞానం చాలా అవసరమని, డిజిటల్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం చాలా ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎమ్.శేఖర్, కోఆర్డినేటర్ డాక్టర్ వై.పద్మ, డాక్టర్ కె శకుంతల, జి.హారతి, కె.శైలజ, జి.సాయికుమార్, ఆర్.మౌనిక, బి.శ్రీనివాసరావు, లక్ష్మీ ప్రసన్నకుమారి, కీర్తి, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మెగా పేరెంట్స్ మీటింగ్‌ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏపీ గురుకుల పాఠశాల, బాలికల ఆశ్రమం పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఈనెల 5వ తేదీన జరుగు మెగా పేరెంట్స్ మీటింగ్‌ను విజయవంతం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రిన్సిపల్స్ శంకర్రావు, బుచ్చిబాబు, ప్రధానోపాధ్యాయులు నాగశకుంతల, నాగభూషణం కోరారు. బుధవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ మీటింగ్‌కు తల్లిదండ్రులు హాజరై సమస్యలు సమావేశం దృష్టికి తీసుకురావాలన్నారు.

వలకు చిక్కిన దోబి జాతి చేప

సీలేరు నదిలో వలకు చిక్కిన దోబి జాతి చేప

ప్రజాశక్తి-సీలేరు : జీకే.వీధి మండలం సీలేరు నదిలో అరుదైన డోబి జాతికి చెందిన చేప గిరిజనుల వలకు చిక్కింది. ఒరిస్సా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా అల్లూరి కోట పంచాయతీ కొందుకూడా గ్రామానికి చెందిన గిరిజనులు ఎన్నో సంవత్సరాల నుంచి సీలేరు నదిలో చేపలను వేటాడుతూ జీవనోపాధి గడుపుకుంటున్నారు. బుధవారం సీలేరులో గిరిజనులు వేసిన వలకు 22 కేజీల బరువు గల చేప లభ్యమైంది. ఈ చేపను స్థానిక బాలాజీ రెస్టారెంట్ ఓనర్ నక్క జ్ఞానేశ్వర్‌రావు కొనుగోలు చేశారు. చేపను చూసేందుకు స్థానికులు ఎగబడ్డారు.

అట్రాసిటీ కేసులపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎస్సి, ఎస్టి అట్రాసిటీ కేసుల పరిష్కారంలో అధికారులు, పోలీసులు ప్రత్యేక చొరవ చూపాలని, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సాయం తీసుకొని త్వరగా ఫలితాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ సూచించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ మీటింగ్ హాలులో బుధవారం సాయంత్రం జరిగిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబు, సిపి శంఖబ్రత బాగ్చీలతో కలిసి ఆయన పాల్గొన్నారు. గత సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న చర్యలపై అధికారులను ఆరా తీశారు. విచారణ పూర్తయిన కేసుల్లో పిపిల సాయం తీసుకొని ముందుకు సాగాలని, విచారణ దశలో ఉన్నవాటిలో వేగం పెంచాలని సూచించారు. విచారణ దశలో 113, పెండింగ్ ట్రయిల్‌లో 689 కేసుల విషయంలో అధికారులు, పిపిలు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. బాధితులకు నిర్ణీత కాలంలో నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేసుల విచారణ, దర్యాప్తు విషయంలో జాగ్రత్త వహించాలని, బాధితులకు అండగా నిలవాలని అన్నారు.

సఫాయి కర్మచారీలుగా పని చేసిన వారికి, వారి కుటుంబ సభ్యులకు ఉపాధి శిక్షణ అందించాలని, తద్వారా స్వయం ఉపాధి లేదా కంపెనీల్లో ఉద్యోగావకాలు కల్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వీరిని గుర్తించేందుకు ఇప్పటికే నిర్వహించిన సర్వే వివరాలను పరిశీలించిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. త్వరితగతిన వారందరికీ సెట్స్, జిల్లా నైపుణ్య సంస్థల ద్వారా శిక్షణ ఇప్పించాలని సూచించారు. రైల్వే సంస్థలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల స్థితిగతులపై ప్రత్యేక పరిశీలన చేయాలని చెప్పారు. రుణ సదుపాయం కల్పనలో, గృహ నిర్మాణ పథకాల్లో ప్రాధాన్యత ఇచ్చి సహకరించాలన్నారు. పని ప్రాంతాల్లో వారికి ప్రత్యేక వసతులు కల్పించాలని చెప్పారు. రైల్వే పరిధిలో సఫాయి కర్మచారీల సమస్యలపై సభ్యులు కొన్ని సమస్యలను ప్రస్తావించగా సానుకూలంగా స్పందించి చర్యలకు ఉపక్రమించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. 37వ వార్డులో సులభ్ కాంప్లెక్స్ నిర్వహణ అధ్వానంగా ఉందని, నీరు లేదని కమిటీ సభ్యుడు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.

దీనిపై స్పందించిన ఆయన నగర పరిధిలోని అన్ని సులభ్ కాంప్లెక్సులను పరిశీలించాలని, రన్నింగ్ వాటర్ ఏర్పాటు చేయాలని జివిఎంసి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డిసిపిలు మణికంఠ, మేరీ ప్రశాంతి, సాంఘిక సంక్షేమ శాఖ డిడి కె.రామారావు, ఇన్‌ఛార్జి డిఆర్ఓ సత్తిబాబు, విశాఖ ఆర్డిఓ సుధాసాగర్, పలువురు ఎసిపిలు, వివిధ విభాగాల అధికారులు, కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, రాంబాబు, ఆంజనేయ, మాలతి పాల్గొన్నారు.

భారత్ - దక్షిణాఫ్రికా వన్డే ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలోని ఏసిఏ - విడిసిఏ స్టేడియంలో ఈ నెల 6న భారత్ - దక్షిణాఫ్రికా మధ్య జరగనున్న మూడో వన్డే మ్యాచ్‌కు సంబంధించిన ఏర్పాట్లను బుధవారం ఏసిఏ సిఒఒ గిరిష్ డాంగ్రే నేతృత్వంలో ఉన్నతాధికారులు పరిశీలించారు. గ్రౌండ్, పిచ్, భద్రత, ప్రేక్షకులకు అవసరమైన అన్ని సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గిరిష్ డాంగ్రే మాట్లాడుతూ విశాఖ మైదానం అంతర్జాతీయ ప్రమాణాలను కలిగి ఉందన్నారు. ఆటగాళ్లకు, ప్రేక్షకులకు మంచి అనుభవాన్ని అందిస్తుందన్నారు. చీఫ్ క్యూరేటర్ నాగ మల్లయ్య మాట్లాడుతూ బ్యాటింగ్ - బౌలింగ్ రెండింటికీ సహాయపడేలా సమతుల్యమైన వన్డే పిచ్‌ను సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో

ఏర్పాట్లను పరిశీలిస్తున్న మ్యాచ్ నిర్వాహకులు

స్టేడియం ఇన్‌చార్జ్ జెకెఎం రాజు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీని స్టీల్‌ప్లాంట్‌కు తీసుకొస్తాం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పార్లమెంటు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని త్వరలోనే విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు తీసుకొస్తామని ఎఐసిసి జాతీయ అధికార ప్రతినిధి సునీల్ అహిరా తెలిపారు. సంఘటన్ శ్రీ జన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయానికి ఆయన విచ్చేశారు. విశాఖ తూర్పు నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా విశాఖ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడి వారి మనసులో ఉన్న అభిప్రాయం తెలుసుకొని, వారి అభీష్టం మేరకు మెజారిటీ నిర్ణయంతో పార్టీ జిల్లా అధ్యక్షున్ని ఎంపిక చేయడానికి తాను విశాఖ వచ్చానని చెప్పారు. జిల్లాలో నాయకులు పార్టీని వీడినా, క్యాడర్ చెక్కు చెదరలేదని, కొత్త డిసిసి ఎంపిక తరువాత పార్టీ బలోపేతంపై దృష్టి పెడతామని అన్నారు. విశాఖకు స్టీల్‌ప్లాంట్ కోహినూర్ వజ్రం లాంటిదని, దాన్ని ప్రైవేటుపరం చేయడం దారుణమని అన్నారు. ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే ఉంచుతామని ప్రకటన చేసేంత వరకూ జిల్లాలో బిజెపి నాయకులను తిరగనీయకుండా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎపిసిసి పరిశీలకులు అమర్ జా బేగం, మార్టిన్ లూథెర్, జమ్ము ఆదినారాయణ, పిసిసి ఉపాధ్యక్షులు వేగి వెంకటేష్, కమలాకర్, డిసిసి కో-ఆర్డినేటర్ ఎల్ఎన్.హాసిని వర్మ, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రియాంక దండి, వి.సూర్యనారాయణ, గాయత్రి పాల్గొన్నారు. డాక్టర్ జి.పవన్ కుమార్, డాక్టర్ విక్రమ్, డాక్టర్ మల్లెల రాజేంద్ర ప్రసాద్ కాంగ్రెస్‌లో చేరారు.

పెచ్చులూడిన భవనం

శిథిలావస్థలో సిడిపిఓ కార్యాలయం

- భయాందోళన చెందుతున్న ఉద్యోగులు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండల కేంద్రంలో ఉన్న ఐసిడిఎస్ సిడిపిఓ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. స్లాబ్ పెచ్చులూడి కింద పడుతుండడంతో అక్కడ పని చేస్తున్న ఉద్యోగులు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు స్లాబ్ కింద భాగం పూర్తిగా పెచ్చులు ఊడిపోయి ఇక్కడ ఉన్న కంప్యూటర్ల పైన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అన్న భయంతో విధులు నిర్వహిస్తున్నారు. వర్షాలకు పూర్తిగా నీరు చెమ్మ బిల్డింగ్‌లోకి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయాన్ని బాగు చేయించాలని, నూతన బిల్డింగ్ నిర్మించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ప్రజలకు సక్రమంగా సేవలు

ప్రజాశక్తి-కొయ్యూరు : గ్రామ సచివాలయాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజలకు సక్రమంగా సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని డిప్యూటీ ఎంపీడీవో టి.శ్రీనివాసరావు అన్నారు. కొయ్యూరు డిప్యూటీ ఎంపీడీవోగా నూతనంగా నియమితులైన సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ సచివాలయాల పర్యవేక్షణకు ప్రభుత్వం తమను ప్రత్యేకంగా నియమించినట్లు తెలిపారు. సచివాలయ సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముంపు భూములకు నష్ట పరిహారమివ్వాలి

ప్రజాశక్తి - కూనవరం : ముంపులో ఉన్న భూములకు పరిహారం ఇవ్వాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని కూటూరు గ్రామంలో సీపీఎం శాఖ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటూరు గ్రామాన్ని ఆర్ అండ్ ఆర్ గ్రామంగా గుర్తించాలని లేకుంటే ధవళేశ్వరం ఇరిగేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. సంవత్సరాలు గడుస్తున్నా కొత్త పింఛన్‌లు ఇవ్వలేదన్నారు. మండలంలో ఉన్న అన్ని గ్రామాలను 41 కాంటూరులో కలిపి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పాయం సీతారామయ్య, నాయకులు రాజు, సోడె శ్రీరాములు, చిచ్చడి రాజయ్య, లక్ష్మయ్య, పైదా రాజు తదితరులు పాల్గొన్నారు.

యువకునిపై పోక్సో కేసు

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరు మేజర్ పంచాయతీ పరిధి దుర్గా వీధికి చెందిన మైనర్ బాలికను నమ్మించి మోసం చేసి అత్యాచారం చేశాడని బాధిత బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాసీన్ తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు బాధితురాలు, వారి తల్లిదండ్రులు, నిందితుడి వివరాలను ప్రకటించలేదని ఎస్ఐ పేర్కొన్నారు.

కార్ల అమ్మకాల్లో స్కోడా రికార్డు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భారతదేశంలో ప్రవేశించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్కోడా ఆటో ఇండియా ఐదు లక్షల యూనిట్ల విక్రయాల మైలురాయిని దాటిందని, సిల్వర్ జూబ్లీ సంవత్సరంలో తమ బ్రాండ్ అద్భుతమైన వృద్ధిని కనబరుస్తోందని బ్రాండ్ డైరెక్టర్ ఆశిష్ గుప్తా తెలిపారు. బుధవారం ఉదయం విశాఖలోని సంస్థ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ నవంబర్‌లో మొత్తం 5,491 యూనిట్లను విక్రయించి, గతేడాది ఇదే నెలతో పోలిస్తే 90 శాతం వృద్ధిని నమోదు చేశామన్నారు. స్లావియా సెడాన్ మోడల్ అమ్మకాలు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు